క్లుప్తంగా

శ్రేయా మిశ్రోకు కళాశక్తి పురస్కారం



శ్రేయా మిశ్రో

పాతపట్నం: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయా మిశ్రోకు కళాశక్తి పురస్కారం వరించింది. రిఫ్లెక్షన్ ఆర్ట్ గురు అసోసియేషన్ ఆధ్వర్యంలో (జాతీయ స్థాయి ఆన్‌లైన్‌లో) నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో (భరత నాట్యం, కూచిపూడి పోటీల్లో) శ్రేయా పాల్గొన్నారు. శ్రేయా మిశ్రో చేసిన నృత్య ప్రదర్శన (ప్లేట్ డాన్స్)కు కళాశక్తి పురస్కారం దక్కింది. సర్టిఫికెట్, మెమెంటోను సంస్థ అధిపతి జి.సాయిశ్రీ పంపించారని శ్రేయా ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో దేశ, విదేశాలకు చెందిన వేలాది మంది నాట్య కళాకారులు పాల్గొని ప్రతిభను కనబర్చారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ, న్యాయనిర్ణేతల తీర్పు మేరకు పురస్కారాలు అందించారన్నారు. శ్రేయాకు పాతపట్నం, శ్రీకాకుళం, విశాఖపట్నంకు చెందిన నాట్య కళాకారులు అభినందనలు తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సరుబుజ్జిలి: విద్యతోపాటు క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని వెంకటసాయి విద్యా సంస్థల కరస్పాండెంట్ కూన జగన్నాథం, ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు అన్నారు. విద్యా సంస్థల ఆవరణలో ఆదివారం ఇంటర్మీడియెట్ ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన



ఇంజినీరింగ్ అధికారులకు సూచనలిస్తున్న రావినాయుడు

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో రూ.2.20 కోట్లతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని ఏపీ స్పోర్ట్స్ అథారిటీస్ చైర్మన్ రావి నాయుడు అన్నారు. ఇండోర్ స్టేడియం పనులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ఆదివారం పరిశీలించారు. స్టేడియం పనులు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. దీంట్లో అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారని, క్రీడాకారులకు అవసరమైన అన్ని పరికరాలను సిద్ధం చేస్తామన్నారు. వేసవి నాటికి స్టేడియాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి



సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

పొందూరు: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనకబడిన శిష్టకరణాలను తక్షణమే ఓబీసీ జాబితాలోకి చేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల శిష్టకరణ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పొందూరు, జి.సిగడాం మండలాల శిష్టకరణ సంఘం సమావేశం నిర్వహించారు. ప్రస్తుత కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఎంపీగా ఉన్న సమయంలో శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని పార్లమెంట్‌లో కోరారని, అది ఆచరణలోకి తీసుకురావాలన్నారు. ఈ నెల 24న శిష్టకరణ వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సభ్యులు వి.దామోదరరావు, కె.రవికుమార్, వి.నిరంజన్, వి.ఉమ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



బూర్జమానుగూడలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

బూర్జ: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని గోపిదేవిపేట నుంచి బూర్జమానుగూడ వరకు రహదారి నిర్మాణానికి రూ.90 లక్షలు, మదనాపురం నుంచి అనంతగిరిపేట వరకు రూ.64 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, మాజీ జెడ్పీటీసీ ఆనెపు రామకృష్ణనాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

దళారుల దందా..

నియోజకవర్గంలో వరి పంట విస్తీర్ణం (ఎకరాలు) వివరాలు ఇలా..	
మండలం	వరి పంట సాగు విస్తీర్ణం
సారవకోట	15,996
జలుమూరు	19,464
పోలాకి	17,627
నరసన్నపేట	17,193



అలుదు సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న ధాన్యం బస్తాలు

- వరి కోతలు, నూర్పిడిలు ప్రారంభం
- ఇతర జిల్లాలకు తరలిపోతున్న పచ్చి ధాన్యం
- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

సారవకోట: ప్రభుత్వం నుంచి అన్నదాతలకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎటువంటి సాయం అందలేదు. ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా గ్రామాల్లో ప్రారంభించలేదు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను దళారులు దోచుకుంటున్నారు. సారవకోట మండలంలో వారం రోజుల నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. స్థానికంగా ఉన్న దళారులు రైతుల నుంచి పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే ఇతర జిల్లాలకు లారీలలో తరలిస్తున్నారు. రైతుల చేతికి పంట వచ్చే సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించాల్సి ఉన్నా.. ఇంతవరకు ఆ ఊసే లేదు. బురుజువాడ, ధర్మలక్ష్మీపురం, కొత్తూరు, గోపాలపురం, తొగిరి, వడ్డినవలస తదితర ప్రాంతాలలో యంత్రాల సాయంతో వరి కోతలు చేపట్టి వచ్చిన ధాన్యాన్ని వెంటనే దళారులకు విక్రయిస్తున్నారు. ధాన్యాన్ని భద్రపర్చేందుకు అవకాశం లేకపోవడంతో దళారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. మండలం నుంచి ప్రతిరోజూ సుమారు 10 నుంచి 15 లారీల ధాన్యం ఇతర జిల్లాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణ రకం వరి ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర (100 కేజీల బస్తా) రూ.2,300గా నిర్ణయించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



తొగిరి సమీపంలో ధాన్యం బస్తాలను లారీలకు ఎక్కిస్తున్న హమాలీలు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తాం



ఉన్నతాధికారుల నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, తహసీల్దార్, సారవకోట

వ్యాపారులకే విక్రయిస్తున్నాం



వరి కోతలు పూర్తయిన తరువాత వాటిని భద్రపర్చుకునేందుకు అవకాశం లేదు. దీనికి తోడు ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. గ్రామాల్లోకి వచ్చే వ్యాపారులకే ధాన్యాన్ని విక్రయిస్తున్నాం. 80 కేజీల బస్తాను రూ.1,200 నుంచి రూ.1,500 వరకు కొనుగోలు చేస్తున్నారు.

– యడ్ల రంగారావు, రైతు, అన్నుపురం, సారవకోట మండలం

రావణ కాష్టంలా రాష్ట్రం

- జిల్లాలో శాశ్వత అభివృద్ధి లేదు
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం ఈ ఐదు నెలల పాలనలో రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చేసిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో ఏదో ఒకచోట మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు పెరిగాయన్నారు. మంత్రి నారా లోకేష్ సూచనలతోనే రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. ఇలాంటి పరిపాలన చేస్తున్నందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. 2024 ఎన్నికల ముందు ఎవరిపై ఎక్కువ కేసులు ఉంటే వారికి అంత పెద్ద నామినేటెడ్ పదవి ఇస్తామని మంత్రి నారా లోకేష్ అనేక సభల్లో చెప్పారని.. అందుకే టీడీపీ నాయకులు దాడులు, హత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో ఆడపిల్లలపై నీచంగా మాటాడితే తాటతీస్తామని పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. చిన్న పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడి హత్యలు చేస్తుంటే.. ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఈ ఐదు నెలల పాలనలో జిల్లాలో శాశ్వతంగా నిలిచిపోయే అభివృద్ధి ఏం చేశారని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమవుతున్నా రైతులకు పంట పెట్టుబడిగా ఇస్తామన్న రూ.20 వేల అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం మహిళలు ఇంకా ఎన్ని నెలలు వేచిచూడాలని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందన్నారు.

పంటకోత ప్రయోగాలతో మేలు

ఎల్.ఎన్.పేట: పంటకోత ప్రయోగాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పంటకోత ప్రయోగాల తనిఖీ (ఎన్ఎస్ఎస్ఓ) అధికారి ఎల్.కల్యాణ్ కుమార్ అన్నారు. మండలంలోని పూశాం రెవెన్యూ పరిధిలో ఆదివారం జరిగిన వరి పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. పంట దిగుబడి తగ్గితే ఆయా రెవెన్యూ పరిధిలో ప్రభుత్వం నుంచి పంటల బీమా వర్తింపజేయటం జరుగుతుందన్నారు. మండలాన్ని 28 యూనిట్లుగా విభజించి 112 పంటకోత ప్రయోగాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ఏఎస్ఓ పి.అప్పలనాయుడు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



పంట దిగుబడిని పరిశీలిస్తున్న తనిఖీ అధికారి కల్యాణ్‌కుమార్

నిరీక్షణ..



సరుబుజ్జిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. కంట్రోలర్ లేకపోవడంతో బస్సుల వివరాలు, వేళలు తెలియక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉంటున్నారు. బస్సులు ఎప్పటికీ రాకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. తక్షణమే ఆర్టీసీ అధికారులు స్పందించి కంట్రోలర్ పోస్టు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

రోడ్డుపైనే మురుగునీరు..



ఎల్.ఎన్.పేట మండలం లక్ష్మీనర్సుపేట గ్రామంలోని ప్రధాన వీధిలో డ్రైనేజీలేక మురికి కూపంగా మారింది. ఇళ్లల్లో వాడిక నీటితోపాటు వర్షంనీరు రోడ్డుపైనే నీరు నిలిచిపోతుంది. ఈ రహదారిలో మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, ఇందిరానగర్ కాలనీవాసులతోపాటు జెడ్పీ ఉన్నత పాఠశాల, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

బోరు బాగు చేయరూ..



పాతపట్నం మండలం చిన్నలోగిడి కాలనీ వాటర్ ట్యాంకు వద్ద ఉన్న బోరు రెండు వారాలుగా పనిచేయడం లేదు. ఈ బోరే కాలనీ వాసులకు ఆధారం. సుమారు 100 కుటుంబాలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరును బాగు చేయాలని కోరుతున్నారు.

- పాతపట్నం

ప్లాస్టిక్ భూతం..



ఈ చిత్రం కొత్తూరు గ్రామంలోని కంచక (సాగు నీటి) చెరువు. ప్రస్తుతం పాలిథిన్ కవర్లతో పేరుకుపోయింది. పాలిథిన్ కవర్ల నిషేధం ఎక్కడా కానరావడంలేదు. సాగునీటి చెరువులు, కాలువలు ప్లాస్టిక్ సంచులతో నిండిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి ప్లాస్టిక్ సంచులను నిషేధించాలని పలువురు కోరుతున్నారు.

- కొత్తూరు

యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం



నూతన కార్యవర్గం

ఎల్.ఎన్.పేట: యూటీఎఫ్ మండల కార్యవర్గ ఎన్నికను ఆదివారం మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించినట్లు జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ అధ్యక్షుడు పి.చిన్నారావు అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల శాఖ గౌరవ అధ్యక్షులుగా జె.ఉష, అధ్యక్షులుగా పి.చిన్నారావు, ఉపాధ్యక్షులుగా ఎం.బాలసుబ్రహ్మణ్యం, బి.సుమతి, ప్రధాన కార్యదర్శిగా సనపల ఢిల్లేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.అజీమ్, కార్యదర్శులుగా పి.కామేశ్వరరావు, కె.వాసుదేవరావు, ఎం.సింహాచలపతి, సి.హెచ్.నిర్మల, ఎస్.శ్రీనివాసరావు, ఎ.గోవిందరావు, కె.గణేష్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ శాఖ జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీరామచంద్రమూర్తి, సురవరపు జయరాం డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో బోధనకు అడ్డంకిగా నిలిచిన యాప్‌ల నిర్వహణను తగ్గించాలన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నరసన్నపేట: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎక్సైజ్ సీఐ ఎస్.వి.రమణమూర్తి హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతీ మద్యం దుకాణం వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేశామన్నారు. 21 ఏళ్ల లోపువారికి మద్యం విక్రయించవద్దని, ఒక వ్యక్తికి 3 బాటిళ్లకు మించి ఇవ్వకూడదన్నారు. బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ మద్యం దుకాణం వద్ద ఎక్సైజ్ అధికారుల ఫోన్ నంబర్లు ఉంటాయన్నారు.

రహదారులు నిర్మించాలి



రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్న గిరిజనులు

హిరమండలం: మండలంలోని పెద్దగూడ ఆదివాసీ గిరిజన పంచాయతీ పరిధిలో ఉన్న పాంద్రమాను గూడ, బలద గూడ తదితర గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పాంద్రమాను గూడ గిరిజన గ్రామంలో స్థానిక గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాలకు 108 వాహనం వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఎవరైనా ఆరోగ్యానికి గురైతే డోలీలే గతి అని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. సవర రమేష్, బాలయ్య, కమలమ్మ, కుమార్, లక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక రుద్రాభిషేకాలు

నరసన్నపేట: స్థానిక ఉమాసోమేశ్వరాలయంలో ఆదివారం సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. పలువురు దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. కార్తీక మాసం మొదటి ఆదివారం ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు జయశంకర్ తెలిపారు.



సామూహిక రుద్రాభిషేకాల్లో పాల్గొన్న దంపతులు

శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ

జలుమూరు: శ్రీముఖలింగంలో కార్తిక మాసం మొదటి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచి బారులు తీరారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భీమేశ్వర, సోమేశ్వర ఆలయాల్లో కూడా భక్తుల రద్దీ కొనసాగింది.



క్యూలో ఉన్న భక్తులు

గణిత పోటీ పరీక్షలకు విశేష స్పందన



నరసన్నపేట: పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు



పాతపట్నం: గణిత పరీక్ష పేపర్‌ను విడుదల చేస్తున్న హెచ్‌ఎం వైకుంఠరావు, ఉపాధ్యాయులు

నరసన్నపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత (బోర్డు) పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి గణిత పోటీ పరీక్షలకు మంచి స్పందన లభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులు 167 మంది హాజరయ్యారు. దీంట్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నియోజకవర్గ స్థాయికి పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీ పరీక్షలు సత్యవరం, ఉర్లాం హెచ్‌ఎంలు వకులా రత్నమాల, కె.హర్షవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు కేశవరావు, శైలజ, నూకరాజు, చిన్నికృష్ణంనాయుడు, ఆదినారాయణ, మురళి, ఈశ్వరారావు, సుధాకర్ పట్నాయక్ తదితరులు పర్యవేక్షించారు.

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం గణిత ఉపాధ్యాయుల వేదిక కన్వీనర్ డి.ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. 140 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎంఈఓ ఎన్.శ్రీనివాసరావు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు గోవిందరావు, నరసింహులు పర్యవేక్షించారు.

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి రామానుజన్ గణిత ప్రతిభా పరీక్షలను ఆదివారం నిర్వహించినట్లు హెచ్‌ఎం వైకుంఠరావు తెలిపారు. పరీక్ష పేపర్లను పీఆర్‌టీయూ సంఘ రాష్ట్ర కార్యదర్శి అమర జనార్దనరావు, గణిత ఉపాధ్యాయుల ఫోరం మండల కన్వీనర్ రెగేటి మధుసూదనరావు విడుదల చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 146 విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు ఎ.గోవిందరావు, కె.అప్పారావు, జి.గోవిందరావు, శంకరరావు, లక్ష్మణరావు, గణపతి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బజార్లు నిర్మించేదెప్పుడు?



బొంతులో పునాదుల స్థాయిలో నిలిచిపోయిన పనులను పరిశీలిస్తున్న గిరిజన నాయకులు

సారవకోట: గిరిజన హాట్ బజార్ల నిర్మాణం ఎప్పుడు పూర్తిచేస్తారని గిరిజన ఐక్యవేదిక, ఎస్టీఎఫ్ నాయకుడు చౌదరి లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజనులు పోడు వ్యవసాయం ద్వారా పండించిన చీపుర్లు, ఇతర పంటలను విక్రయించేందుకు వీలుగా గత ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ ద్వారా సారవకోట మండలంలో బొంతు, సారవకోట గ్రామాలలో హాట్ బజార్లను మంజూరు చేసిందన్నారు. రూ.ఐదు లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు.

అనంతరం సాధారణ ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు, ఐటీడీఏ అధికారులు స్పందించి హాట్ బజార్ భవన నిర్మాణాలు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. బోడవలస ఆనందరావు, దండాసి ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

కొత్తూరు: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు అన్నారు. మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలో ఆదివారం అవగాహన కల్పించారు. గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలను అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మహిళలు ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఐ ఎం.ఎ.అహ్మద్, పోలీసులు పాల్గొన్నారు.

హిరమండలం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ మహమ్మద్ యాసిన్ అన్నారు. మండలంలోని గొట్ట గ్రామంలో సైబర్ మోసాలు, దొంగతనాలపై ఆదివారం అవగాహన కల్పించారు.

ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు, లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. ఓటీపీ, పిన్ కోడ్‌లు చెప్పవద్దన్నారు. అనంతరం హిరమండలం ఏబీ రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు.

కొంచాడ ఆశయాలు కొనసాగించాలి

పాతపట్నం: మాజీ ఏఎంసీ చైర్మన్ కొంచాడ వీరభద్రరరావు ఆశయాలను కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ అన్నారు. మండలంలోని తిడ్డిమి గ్రామంలో వీరభద్రరావు విగ్రహాన్ని ఆయన కుమారులు జగన్నాథరావు, శేషగిరి ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. మండల సచివాలయ మాజీ కన్వీనర్ వై.సూర్యం, మండల ప్రధాన కార్యదర్శి జి.రాము, పార్టీ నాయకులు సవిరిగాన శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, పి.ఫల్గుణరావు, సుధాకర్, బాబూరావు పాల్గొన్నారు. వీరభద్రరరావు విగ్రహానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నివాళులర్పించారు.

పరామర్శ..



రాధమ్మను పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొండాల కృష్ణవేణి అత్త రాధమ్మను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ ఆదివారం పరామర్శించారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతుండటంతో పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ ధర్మాన పద్మప్రియ, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, కొండాల బాబూరావు, కోరుకొండ శంకరరావు, పార్టీ నాయకులు నక్క తులసీదాస్, యాళ్ల శ్యామసుందరరావు తదితరులు ఉన్నారు.